

రాంపా

# అనరాదే బాలా !
# రానరాదే బేలా !!

ఆ పరువం తీరే వేరు!

చూసే వాళ్ల కనుల పండుగ్గా, వినేవాళ్ల వీనుల విందుగా, నోరూరించే వైభవం ఆమెది!

రేపల్లెలో కాపురానికి వచ్చాక సుమాంగి అందం మరింత పరిమళించింది.

భర్త కనుసన్నల్లో మెదుగుతూ, అత్తమామల అదుపాజ్ఞల్లో ఒదుగుతూ, ఆ ఇంటి కీర్తి ప్రతిష్ఠల్ని నిలుపుతోంది. ఇంట్లోవారికి తలలోని నాలుకలా సంచరిస్తుంది.

ఇరుగు పొరుగు వారికి చేదోడు వాదోడుగా వుంటూ ఆయింటి దీపంలా వెలుగుతూ వుంది. తనేమో, తన ఇల్లాలి తనమేమో తప్ప మరో ప్రపంచం తెలీదామెకి.

ఆరోజజు సాయంతనం

సంజెదీపం వెలిగించి శ్రీతులసికోటకు మొక్కి వీధిలోకి వెళ్లిన భర్త రాకకోసం ఎదురుచూస్తూ, గడపలో నుంచుంది సుమాంగి.

అత్తా మామా ఇద్దరూ ఊళ్లోలేరు. ఆడబిడ్డకు చీరె సారె పట్టుకుని వెళ్లారు. ఇంట్లో ఉండేది ఇద్దరే సుమాంగి, ఆమె భర్త గోపాలుడు.

చీకటి పడితే చాలా - భార్య వెంగుపట్టుకునే గోపాలుడు ఏం పనిమీదో వీధిలోకి వెళ్లి యింకా తిరిగి రాలేదు. అతని కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తోంది సుమాంగి.

అల్లంత దూరంలో కనిపించాడు బాకిట్టయ్య.

జనముద్దు బిడ్డ.

చూసీ చూడగానే ముద్దొచ్చే మురిపాల నందగోపాల నందనుడు.

అతనికీ కన్పించింది సుమాంగి.

ఆమెను చూసీ చూడగానే -

పాఠశాలకు రాకుండా ఎగనామం పెట్టి - వీధుల వెంటా., తోటల వెంటా,

కోనల వెంటా, కొండల వెంటా వెడ తిరిగే ఆకతాయి పిల్లను చూసిన గురువుగారిలా అయాపోయాడు బాలకిట్టయ్య.

దగ్గరగా వచ్చాడు

చిక్కావులే దొంగా అన్నట్టుగా నిలేసి అడిగాడు 'నువ్వేనా సుమాంగి?' వేలెడేసి లేకపోయినా చూపులతోనే శృంగార వీధిలో విహరిపం చేసేలా ప్రశ్నించాడు కిట్టయ్య.

'నువ్వేనా బలకిట్టయ్య?'

ఎదురు ప్రశ్నవేసింది సుమాంగి. ఆ ప్రశ్నలో పలకరింపు లేదు. పులకరింపూ లేదు. అన్ని లేకున్నా మానే హేళన కూడా వుంది.

'చూస్తే వేలెడు లేదు. సుందరాంగుల్ని పలకరించడం పైపై శృంగార చేష్టలు చెయ్యడం...ఇదేనా నీ పని? అన్న అర్థం కూడా వుందందులో.

'బాల గోపాలుడివి మదన గోపాలుడిలా మెలగొచ్చా?' అనే మందలింపూ వుంది. 'ఆల మందలతో తిరిగే వాడివి ఆలుమందలతో పనేమిటి?' అని అవహేళనా వుంది.

'ఇంకా తడారని వయసు. వయసుకత్తెరలతో పనేమిటి?' అనే దండింపూ వుంది. దండాదింపూ వుంది.

ఇన్ని అర్థాలూ యిట్టే అర్థమైనాయి బాలకిట్టయ్యకు. నీలాటి సంఉదరాంగుల్ని ఎందర్ని చూళ్లేదు అన్నట్టుగా నవ్వాడు. 'ఊఁ మాట కారివే?' పెదాలు విచ్చీ విచ్చకుండా పుచ్చ పువ్వులాంటి వెన్నెలాంటి చిరునవ్వు పెదాల మీద చిందులేయగా అన్నాడు.

'కాదనుకున్నావా?' కనుబొమ్మలు ఎగరేస్తూ పెదవి బిగిస్తూ అడిగింది సుమాంగి.

'నువ్వేం కాదనుకున్నావ్?' తనని కాదన్నమాట గుర్తొచ్చి అవకాశం దొరగ్గానే ఎత్తిపొడిచాడు. మాటకు మట బదులు చెప్పే అవకాశం యివ్వకుండా మాటలు పొడిగించాడు.

'నువ్వే కాదనుకున్నావ్? అందుకే అడవికి రావు. బృందావన వీధీ విహారం చెయ్యవు. నా ఆట చూడరావు. నాపాట వినరావు. ఏమిటి నీ గీర? ఎందుకు రావు? ఏమిటి నీ గొప్ప? నిన్ను పిలవాలా బొట్టు పెట్టి?' అన్నాడు గబగబా!

'పెట్టకొంచెం కూతఘనం' అనుకుందామె.

'పిట్ట పొగరణిగేలా ప్రవర్తించాలి' అనుకుంది సుమాంగి. చిటికెన వేలంత చిన్నవాడిని చిందులు వేయించాలి అనుకుంది మళ్లీ

'యాదవా!'

సుమాంగి పిలుపు గునపంలా గుచ్చుకుంది

నల్లని బుగ్గలు ఎరుపు రంగద్దుకున్నాయ్. నీలి నీలి కనులలో ఎర్రని జీరలు చోటు చేసుకున్నాయ్

'నీ వేణుగానం వినడానికి ఎందుకు రాలేదని అడుగుతున్నావా? చెబుతా విను! మహా గాయకుడినని, మహానర్తకుడిననివాగారెక్కిన నీకు తలతిక్క వదిలేలా తగిన జవాబు చెబుతున్నా విను. నీది పాట కాదు...అలా తెల్లబోతావేం...విను....నిజం.....నీదిపాటేకాదు. అవును, పాటే కాదు'

నిర్ఘాంత పోయాడు కిట్టయ్య

'అవును. అది పాట కాదు.

పాట చెవుల్లోదూరి గుండెకు సౌఖ్యాన్ని చేకూరుస్తుంది. కానీ నీ పాట? నీపాటవిని ఎవరయినా సుఖపడ్డారటయ్యా? ఎగిసెగిసిపడే ఎదతో సోలిపోతారు కానీ? తెలిసిందా నీగానం సుఖాన్నివ్వదబ్బాయ్...దుఃఖాన్నే ఇస్తుంది.'

మాట పెగిలి రావడం లేదు కిట్టయ్యకు.

ఆటతో పాటతో ఆ బాలగోపాలాన్ని అలరించిన బాలగోపాలుడు మాటలాడలేకపోయి మౌనం వహిస్తే

'నేను నీ పాట వినడానికి రానోయీ' అంది సుమాంగి

'ఎందుకు?' ఉక్రోషంతో అడిగాడు

'అది సంగీతమా?'

'కాదా?' ఎదురు ప్రశ్న వేశాడు

'కాదు! బృందంలోని భృంగ గీతం! కలువల కలవాలనే భృంగ గీతం' నవ్వింపుగా అందామె.

ఆ నిష్ఠురానికి నిలబడిపోతే......

'నీది సంగీతమా? ఎక్కడ నేర్చావోయీ?

ఎవరు నేర్పారోయీ? ఎవరోయీ నీ గురువు?' వగలు పోతూ ఆ వగలాడి అలా ప్రశ్నిస్తే, దానికి...........

కిష్టయ్య చూపులే జవాబులయితే.....

'ఎల్లాసంపాదించావో కానీ ఒకపిల్లన గ్రోవిసంపాదించావులే.... పెద్ద.....దాన్ని ఊది ఊది వెర్రి ధ్వనులు సృష్టిస్తూ గానం అంటే ఏమిటో తెలియని ఈ వెర్రి ప్రజాంగనలను నీ చుట్టూ తిప్పుకుంటూ,. వెంత చేరిన వాళ్లతో కలిసి పిచ్చి పిచ్చిగా గెంతి, అదే ఆట అనుకుంటూ......ఎంత మోహంలో ఉనావయ్యా కిట్టయ్యా?'

ఆనిందకీ పెదవి విప్పలేదు కిట్టయ్య

'నీకు తెలుసా?

తెలుసో తెలియదో నాకైతే తెలీదు.....

కానీ నా చిన్ననాడు మా తండ్రి నాకు సంగీతం చెప్పింవాడోయీ! సంగీతంలో ఏడు స్వరాలుంటాయి. సరిగమపదనిరాన్లో వర్ణాలూ మెట్లూ కీర్తనలు నేర్చానోయీ. దానికి లయ వుంటుంది. శృతి వుంటుందోయీ స్వామీ!

తలూపేడు.

'నీ పాట అంత అడ్డగోలుగా వుండదు సంగీతం అంటే.....

రాగ భావ రసయోగమయ్యా నాదం-

నీ సంయోగం కాదు. నీతో సయ్యాటాకాదు."

అలాగా అన్నట్టు మళ్లీ తలెపేడు కిట్టయ్య.

'గానం పరమార్థంగా ఉంటుందయ్యా బాలాడా?

ఊరికే గింతుతూ, ఆ జపం జీవం లేని వెదురుముక్కని రంధ్రాలు వేసి ఊదెయ్యడం కాదోయీ పసివాడా?'

ఒక్కమాటా మర్మఘాతంగా వుంది.

'ఏమిటి ఈవిడ ఉద్దేశ్యం?

పెద్ద సంగీత వేత్తలా నీతి ఆపఠాలు చెబ్తోంది! గీత పాఠంలా! సంగీత పాఠంలా!

అంతగా తసంటే యిష్టంగా వుంటే అడవికి రారాదా? ఆటా పాటా మేటిగా నేర్పరాదా? తీర్పరాదా?"

అనుకున్నది అనుకున్నట్టుగా అనేశాడు

'అడవికి రారాదా అన్నావు. బావుంది. కానీ సంగీతం నేర్చుకుని ఏది పాటో ఏది కా[illegible] [illegible]సినదాన్ని నా పాట వినరావా అంటే ఎలా వస్తాను?'

'[illegible]వు లాంటి మెయి సొగసుదానా? సుమాంగీ! నీవు మాబోటికి రా!

అక్కడ నేనేదో వూఁ వూఁ అంటూ పిల్లంగ్రోవి వూత్తాఁ ఆ పిల్లంగ్రోవి పిలుపు విని....ఆ ధ్వని గుండెల్లో అలజడి సృష్టిస్తే కాపురాన్ని విడిచి నా చుట్టూ తిరుగాతావు రావే!' అని పిలవగా

ఆపై -

'సుమాంగీ!'

చిన్న కిట్టయ్య గొంతులోంచి ఆ పిలుపు వెలికి రాగానే -

అది వేణుగానమై -

వీణీ వాదమై -

జీవన వేదమై -

శృతి పుటాల దూరి శృతి పాటలా మారి సుమాంగి గుండెల్ని చేరి పయ్యెద చాటు ఎదని పరవళ్లు తొక్కించింది.

ఆమె కేమీ అర్థం కాలేదు.

ఎక్కడిదీ సంగీతం?

ఎక్కడిదీ మాధుర్యం?

తను నేర్చిన సప్తస్వర రాగ రంజితం కాక...... నవ స్వరమై సుస్వరమై జీవన భాస్వరమై నవజీవన బృందావన వన వికసిత సితకల్హారమై ......మై మరుపు తెప్పించింది.

'కృష్ణా! కృష్ణా!'

ముందు కృష్ణుడు

ఆ వెనుక సుమాంగి

పలికించిన సప్తస్వరాలకంటే.....ప్రౌఢమైన పలికించని ఆ కొత్త స్వరానికి బందీ అయింది సుమాంగి.

ఆ గాన లహరిలో తేలిపోయి పరవశించింది.

వెంటపడింది.

వేవేల జన్మల వెతకులాట ముగిసింది.

(కవి సమ్రాట్ విశ్వనాథ 'శ్రీకృష్ణ సంగీతం' లోని 'పిలుపు' కి ప్రతిధ్వనిగా)

* * *